12-03-2025
బుధవారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 172 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

JB
జయభేరి

## 4 ట్రిలియన్ డాలర్లు ఆవిరి

- ట్రంప్ ఆర్థిక విధానాల వల్ల అమెరికా మార్కెట్ కుదేలు




జయభేరి, న్యూయార్క్, మార్చి 11:

ట్రంప్ ఇచ్చిన షాక్‌తో ఇన్వెస్టర్లు భయపడ్డారు. దీంతో వాళ్లు మార్కెట్ షేర్లను అమ్మేసుకున్నారు. సోమవారం వాల్ స్ట్రీట్‌లో సుమారు నాలుగు ట్రిలియన్ల డాలర్ల నష్టం జరిగింది. యూఎస్ స్టాక్ మార్కెట్లనుంచి 4 ట్రిలియన్ డాలర్లు ఆవిరైపోయాయి. ట్రంప్ ఆర్థిక విధానాల వల్ల మార్కెట్లు షేక్ అవుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. వాల్ స్ట్రీట్‌కు చెందిన అన్ని ప్రధాన ఇండెక్స్‌లు సోమవారం ట్రేడింగ్‌లో వడిదిడుకులు ఎదుర్కొన్నాయి.డౌ, ఎస్ అండ్ పీ 500, నాక్‌డాక్ మార్కెట్లు .. తీవ్ర వత్తిడికి లోనయ్యాయి. డౌ ఇండెక్స్ ట్రేడింగ్‌లో సుమారు 890 పాయింట్లు తక్కువ వద్ద ముగిసింది. ఇక ఎస్ అండ్ పీ 500.. 2.7 శాతం తక్కువ ట్రేడ్ అయ్యింది. టెకీ కంపెనీలు ఉండే నాస్‌డాక్ 4 శాతం నష్టపోయినట్లు తెలుస్తోంది. నవంబర్‌లో దేశాధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నికైన నాటి నుంచి అమెరికా మార్కెట్లు డౌన్ అవుతూనే వస్తున్నాయి.

## తెలంగాణకే తలమానికం

2 లో





# నేటి నుంచే అసెంబ్లీ

- 17న లేదా 19న బడ్జెట్
- తొలిరోజు ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ స్పీచ్
- 14న హోలీ హాలిడే 17న లేదా 19న బడ్జెట్
- సభ ముందుకు రానున్న 42% బీసీ రిజర్వేషన్ల
- బిల్లులు, ఎస్సీ వర్గీకరణ బిల్లు

జయభేరి, హైదరాబాద్ :

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నేటి నుంచి మొదలు కానున్నాయి. 202526 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌తో పాటు కీలక బిల్లులను ప్రభుత్వం ప్రవేశ పెట్టనుంది. బీసీల 42 శాతం రిజర్వేషన్ల బిల్లులు, ఎస్సీ వర్గీకరణ బిల్లుకు సభ ఆమోదం తీసుకోనున్నారు. నేడు తొలి రోజు ఉభయ సభలను ఉద్దేశించి..గవర్నర్ ప్రసంగం ఉంటుంది. గవర్నర్ ప్రసంగం పై మరుసటిరోజు ధన్యవాద తీర్మానం ఉంటుంది. 14న హోలీ కావడంతో సభ జరగదు. ఒకవేళ ధన్యవాద తీర్మానం చర్చ కౌన్సిల్లో పూర్తి కాకపోతే 15న కూడా దానిపై చర్చించే చాన్స్ ఉంది. 17న ఎస్సీ వర్గీకరణ బిల్లుపై, 18న బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లులపై అసెంబ్లీలో చర్చించి ఆమోదం తీసుకుంటారని సమాచారం. ఈ నెల 19న రాష్ట్ర బడ్జెట్ను ప్రవేశ పెట్టనున్నట్లు తెలుస్తున్నది. ఆ తర్వాత పద్దులపై చర్చించనున్నారు. నెలఖారు వరకు బడ్జెట్ సమావేశాలు కొనసాగించనున్నట్లు సమాచారం. ఒకవేళ రాష్ట్ర బడ్జెట్ను 17న పెడితే చివరలో బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లులు పెట్టే అవకాశం ఉంటుంది. బీఏసీ సమావేశంలో చర్చించిన తరువాత సభ నిర్వహించే రోజులపై పూర్తి క్లారిటీ రానుంది. బీసీ, ఎస్సీ ఎజెండాతో ప్రభుత్వం ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలు

...మిగతాది 2 లో

## ప్రైవేట్ సైన్యంతో బాకీ వసూళ్లకు దౌర్జన్యం

- ఖమ్మం మధురా నగర్ లో దారుణం
- మహిళ పై అసభ్యకరంగా ప్రవర్తించిన 8 మంది వ్యక్తులు, ఇద్దరు మహిళలు
- ఇంట్లో నగదు, బంగారం, ఎత్తు కెళ్ళి విచక్షణ రహితంగా దాడి



జయభేరి, ఖమ్మం:

ఖమ్మం మధుర నగర్ రోడ్ నెంబర్ వన్ లో దారుణం చోటుచేసుకుంది. బ్రెయిలర్ కోళ్ల వ్యాపారం కోసం అప్పు తీసుకున్నందుకుగాను తిరిగి ఇవ్వాలని ఓ ఇంటిపై ప్రైవేట్ సైన్యం దాడి చేసి భయభ్రాంతులకు గురి చేసింది. 2024 ఏప్రిల్ నుండి 2025 ఏప్రిల్ లోపు అప్పు చెల్లించాల్సి ఉండగా బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్ ద్వారా తీవ్రంగా నష్టపోయామని ఇల్లు పూర్తిగా అమ్మి అప్పు తీరుస్తామని చెప్పినా సరే ప్రైవేట్ వ్యక్తులు ఇంట్లోకి చొరబడి మహిళలని విచక్షరహితంగా దాడి చేసి , మొదటి అంతస్తు నుండి ఇడ్చు కెళ్ళి దాడి చేసిన సంఘటన ఖమ్మం నగరంలో సంచలనం కలిగించింది. మధుర నగరకు చెందిన నర్వనేని నరేష్ నైమిశా దంపతులు, 2024లో మధ్యవర్తులు పోచం అప్పారావు భాస్కర్ సొందు ద్వారా హైదరాబాద్ ఐటి ఏఎస్ఐగా పనిచేస్తున్న రాజ్య నాయక్ పేరు తో నుండి ఏపీజీవీబీ బ్యాంకు ద్వారా లోన్ పొంది అప్పు తీసుకున్నారు. అప్పు కూడా మధ్యవర్తుల ద్వారా నరేష్ నైమిశ ఇంటి పేరు తో వున్న రిజిస్ట్రేషన్, వారికి లోన్ రాధను నమ్మ బలికి పోలీసు అధికారి గా ఉన్న రాజ్య నాయక్ పేరు తో బ్యాంకులో వారి ఆస్తిని తాకట్టు పెట్టి వారికే అమౌంట్ ఇచ్చి ఆస్తిని కాల్ చేసేందుకు సదరు వ్యక్తులు ప్రయత్నం చేశారు. వారి ఆస్తి కొనుగోలు కోసం ఇతరులు ఎవరొచ్చినా సరే భయభ్రాంతులకు గురిచేసి ఆర్థికంగా దెబ్బతీయాలని కుట్ర చేస్తున్నారని బాధ్యత కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ క్షణమైనా తమపై దాడి చేసి హత్య చేసే అవకాశం ఉందని తక్షణమే తమని రక్షించాలని వేడుకున్నారు.

## సుడిగాలి పర్యటన

3 లో





## అఘాయిత్యాలకి పాల్పడితే కఠిన శిక్షలు

- నక్కపల్లి లో భారీ అవగాహన ర్యాలీ
- మహిళల భద్రత కోసం ప్రచార రధాలు, డ్రోన్లు ప్రారంభం.. -హోం మంత్రి అనిత

జయభేరి, నక్కపల్లి :

మహిళలు, చిన్న పిల్లలపై అఘాయిత్యాలకి పాల్పడిన కేసులలో దర్యాప్తు వేగవంతం చేసి వెంటనే కఠిన శిక్షలు విధించడం జరుగుతుందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా నక్కపల్లిలో అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన మహిళలకు మెగా అవగాహన కార్యక్రమంలో హోం మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా నక్కపల్లి పోలీస్ స్టేషన్ నుండి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లాలో మహిళలకు అవగాహన కల్పించుటకుగాను ప్రచార రథం ప్రారంభించి, 39 శక్తి వాహనాలు, 11 డ్రోన్లను పోలీస్ శాఖ వారికి అందించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ.. మహిళల రక్షణ కొరకు ప్రభుత్వం శక్తి యాప్ ఏర్పాటు చేసిందని, ఆపదలో ఉన్న మహిళలు, ఆడపిల్లలు 112 ఫోన్ చేసి పోలీసు వారి సహాయాన్ని పొందువచ్చునని తెలిపారు. శక్తి టీములు పట్టణాల్లో ఐదు నుండి పది నిమిషాలలో, గ్రామీణ

...మిగతాది 2 లో

## ఉప్పల్ అభివృద్ధి శ్రీకారం

- విశ్వనగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతున్నాం
- నిధుల కొరత ఉన్న హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తున్నాం
- కేటీఆర్ అవినీతి బయటపడుతుందనే టీడీఆర్‌పై ఆరోపణలు
- ఉప్పల్, రామంతాపూర్ డివిజన్లల్లో రూ. 42 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- మీడియా సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి



జయభేరి, ఉప్పల్ :

ఉప్పల్ లో రూ. 42 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు, తెలంగాణ ప్రభుత్వం చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, జిల్లా కలెక్టర్ గౌతమ్, ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు గీత ప్రవీణ్ ముదిరాజ్, దేవేందర్ రెడ్డి, ప్రభుదాస్, శాంతి సాయి జెన్ శేఖర్, బండారు శ్రీవాణి, మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి, బొంతు శ్రీదేవి, స్వర్ణ రాజ్ శివమణితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఉప్పల్ వార్డు కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడారు.

ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఉప్పల్ తో పాటు రాష్ట్రమంతా అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేసి ఎన్ని నిధులైన అందిస్తాం. హైదరాబాద్ నగరానికి అంతర్జాతీయంగా మరింత గుర్తింపుతో పాటు గత పాలకులు పట్టించుకోని కాలుష్య నివారణ, స్వచ్ఛమైన గాలి, వాతావరణంకు తోడు అభివృద్ధి వేగవంతం చేసేందుకే మూసి ప్రక్షాళనకు ప్రభుత్వం స్వీకారం చుట్టింది. పేదరిక నిర్మూలన ప్రజల

...మిగతాది 2 లో

## ఇంట గెలిచే ప్రయత్నంలో రాహుల్

...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## నేటి నుంచే అసెంబ్లీ

బడ్జెట్ సమావేశాలు ఈసారి గరం గరంగా సాగనున్నట్లు తెలుస్తున్నది. మాజీ సీఎం, ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ కూడా సభకు హాజరవుతానని సంకేతాలు పంపించారు. దీంతో మొత్తం బడ్జెట్ సమావేశాలు పూర్తయ్యే వరకు రోజూ ఆయన వస్తారా లేక ఒకటి, రెండు రోజులు మాత్రమే వస్తారా? అనేదానిపై క్లారిటీ లేదు. ప్రతిష్టాత్మకమైన 42శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లులతో పాటు ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించనుండటంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో సభలో వ్యవహరించనున్నట్లు తెలుస్తున్నది. ఇందుకోసం గత ప్రభుత్వం పదేండ్లలో బీసీలు, ఎస్సీలకు ఏం చేసిందనే దానిపై బీఆర్ఎస్ ను ఎండగట్టనుంది. దేశవ్యాప్తంగా కులగణన చేసి బీసీలకు తగిన విధంగా రిజర్వేషన్లు కల్పించాలని బీజేపీ ని కార్నర్ చేయనుంది. సాగు, తాగునీటితో పాటు రుణమాఫీ, రైతు భరోసా, గురుకులాలు, గ్యారంటీల అమలుపై అధికార పక్షాన్ని ప్రతిపక్షాలు ఇరుకున పెట్టేందుకు సిద్ధమవుతున్నాయి.

**అన్ని ప్రశ్నలకు అధికారులు పూర్తి సమాధానాలు పంపాలి: సీఎస్**

అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాలకు సంబంధించి ఉన్నతాధికారులతో సీఎస్ శాంతికుమారి సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు లేవనెత్తిన అన్ని ప్రశ్నలకు త్వరితగతిన పూర్తి సమాచారంతో సమాధానాలు పంపాలని అసెంబ్లీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆఫీసర్లకు ఆమె సూచించారు. బడ్జెట్ సెషన్‌లో సరైన సమాచారం అందించేందుకు సంబంధిత కార్యదర్శులు తప్పనిసరిగా హాజరుకావాలని, శాఖల వారీగా నోడల్ అధికారులను కూడా నియమించుకోవాలన్నారు. తదుపరి రోజుల్లో వివిధ శాఖల డిమాండ్లపై చర్చ జరగనున్నందున, వివిధ శాఖల వారీగా పూర్తి వివరాలతో అధికారులు సన్నద్ధం కావాలని సీఎస్ స్పష్టంచేశారు.

## ఉప్పల్ అభివృద్ధి శ్రీకారం

విద్య వైద్యం తదితరణ కోసం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. ప్రపంచంలోని పారిశ్రామిక దేశాలకు దీటుగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసుకుని యువతకు సాంకేతిక శిక్షణ ఇచ్చి వారి అభివృద్ధితో రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధిని ముడి వేస్తున్నాం. గోదావరి, కృష్ణ జలాలతో రిజర్వాయర్లు ఏర్పాటు చేసి జంట నగరాల దాహార్తి తీరుస్తాం. పిడిఆర్ కార్యక్రమం కేటీఆర్ మంత్రిగా ఉన్నప్పుడు ఏర్పాటు చేసింది. పిడిఆర్ ఇంకా ప్రారంభం కాలేదు వారికి సంబంధించిన అవినీతి బయటపడుతుందని కేటీఆర్ విమర్శలు ఆరోపణలు చేస్తున్నారు. నిధుల కోరత వెంటాడుతున్నా, నిధులు లేకున్నా గ్రేటర్ హైదరాబాద్ ను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం. రాష్ట్రం అభివృద్ధి కోసం ప్రతిపక్షాల నిర్మాణాత్మకమైన సూచనలు, సహకారాన్ని తీసుకుంటాం.

ఈ సంధర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఉప్పల్ నియోజకవర్గంలో 42 కోట్ల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి శ్రీధర్ బాబు, నియర్ విజయలక్ష్మి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితో కలిసి ప్రారంభించడం సంతోషం. గతంలో మంత్రిగా ఉన్నప్పుడు ఉప్పల్ అభివృద్ధికి అడిగిన అన్ని నిధులు ఇచ్చాం. ఉప్పల్ పరిసరాల్లోని జిహెచ్ఎంసి ప్రాంతాల అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన నిధులను పార్టీలకు అతీతంగా అందిస్తాం. ఉప్పల్ తో పాటు పొరుగునే ఉన్న ఎల్బీనగర్, ఇటు మేడ్చల్ జిల్లాలోని ఇతర ప్రాంతాలకు అవసరమైన అభివృద్ధి నిధులను సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి, శ్రీధర్ బాబు సహకారంతో అందించేందుకు కృషి చేస్తా.. ఈ కార్యక్రమంలో మేయర్ గద్వాల విజయలక్ష్మీ, డిప్యూటీ మేయర్ శ్రీలత రెడ్డి, జిల్లా కలెక్టర్ గౌతమ్, కార్పొరేటర్లు గీత ప్రవీణ్ ముదిరాజ్, దేవేందర్ రెడ్డి, ప్రభుదాస్, శాంతి సాయి జెన్ శేఖర్, బండారు శ్రీవాణి వెంకట్ రావు, రజిత రెడ్డి, బొంతు శ్రీదేవి, స్వర్ణరాజ్ శివమణి, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అఘాయిత్యాలకి పాల్పడితే శిక్షలు

ప్రాంతంలో 10 నుండి 15 నిమిషాలలో ఫోన్ వచ్చిన ప్రాంతానికి చేరుకొని సహాయం అందిస్తాయని చెప్పారు. ఆడపిల్లలు మహిళలపై అగాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటువంటి కేసులపై విచారణ వేగవంతం చేసి మూడు నెలల లోపునే శిక్ష పడేలా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఎన్డీయే కూటమి గంజాయి, డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపుతుందన్నారు. గంజాయి పంట సాగు పై నిరంతర నిఘా కొరకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లాలో 39 చెక్ పోస్టు ఏర్పాటు చేసి నిరంతర నిఘా కొనసాగించడం ద్వారా గత ఆరు నెలలలో ఎనిమిది వేల కేజీల గంజాయిని పట్టుకోవడం జరిగిందన్నారు. గంజాయి కేసుల్లో 490 మందిని పట్టుకోవడం జరిగిందని, 19 వాహనాలు సీజ్ చేయడం జరిగిందన్నారు. పిల్లలు డ్రగ్స్ బారిన పడకుండా తల్లిదండ్రులు నిరంతర పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. ముఖ్యంగా మగ పిల్లలు డ్రగ్స్ బారిన పడకుండా చూసుకోవాలన్నారు. డ్రగ్స్ వాడిన, పండించిన, రవాణా చేసిన, వ్యాపారం చేసినా కఠిన శిక్షలు పడుతున్నాయని హెచ్చరించారు. గంజాయి వ్యాపారం చేసిన వారి ఆస్తులు జప్తు చేయడం జరుగుతుందని తెలిపారు. కుటుంబంలో అబ్బాయితో పాటు అమ్మాయిని కూడా సమానంగా పెంచాలని, వారికి విద్య అందించాలని, వారు స్వతంత్రంగా జీవించే అవకాశాన్ని, ఆర్థిక స్వతంత్రాన్ని అందించాలన్నారు. అమ్మాయిలు ప్రస్తుత సమాజంలో జాగ్రత్తగా ఉండాలని, మోసం చేసే వారి పట్ల జాగరూకతతో మెలగాలని హోం మంత్రి సూచించారు.

## పాకిస్థాన్‌లో మరోసారి చెలరేగిపోయిన ఉగ్రవాదులు

- జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలును హైజాక్
- ముందుగా ట్రాక్‌ను పేల్చేసిన ఉగ్రవాదులు.. ఆ తర్వాత రైలుపై కాల్పులు
- ఈ దాడిలో ఆరుగురు మిలిటరీ సిబ్బంది మృతి



**జయభేరి, బలోచిస్థాన్, మార్చి 11 :**

పాకిస్థాన్‌లో ఉగ్రవాదులు మరోసారి చెలరేగిపోయారు. బలోచిస్థాన్‌లోని క్వెట్టా నుంచి ఖైబర్ పఖ్తుంఖ్వాలోని పెషావర్‌కి వెళ్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలును హైజాక్ చేశారు. హైజాక్ చేసిన సమయంలో రైలులో 400 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ దాడికి వేర్పాటువాద సంస్థ బలోచ్ లిబరేషన్ ఆర్మీ(బిఎల్ఎ) బాధ్యత తీసుకుంది. ముందుగా ట్రాక్‌ను పేల్చేసిన ఉగ్రవాదులు ఆ తర్వాత రైలుపై కాల్పులు జరిపారు. ఈ దాడిలో ఆరుగురు మిలిటరీ సిబ్బంది ప్రాణాలు కోల్పోయినట్లు బిఎల్ఎ వెల్లడించింది. ఆ తర్వాత రైలును తమ నియంత్రణలోకి తీసుకుంది. ప్రయాణికులతో పాటు కొందరు భద్రతా సిబ్బంది కూడా రైలులో ఉగ్రవాదుల చెరలో బందీలుగా ఉన్నారు. ఎలాంటి మిలిటరీ ఆపరేషన్‌కు ప్రయత్నించినా.. అందరిని చంపేస్తామని ఉగ్రవాదులు హెచ్చరించారు. సహాయక, భద్రతా సిబ్బంది ఘటనాస్థలికి చేరుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# ఇంట గెలిచే ప్రయత్నంలో రాహుల్

"నాతో వచ్చేదెవరు.. యుద్ధం చేసేదెవరు?" అంటూ బాహుబలి సినిమాలో ఓటమి నైరాశ్యంలో ఉన్న సైన్యానికి ధైర్యం చెప్పి కార్యోన్ముఖులను చేసిన సైన్యాధ్యక్షుడి డైలాగ్ అందరికీ గుర్తుండే ఉంటుంది. ఇప్పుడు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పరిస్థితి అలాగే ఉంది. ఓవైపు ప్రత్యర్థి భారతీయ జనతా పార్టీ ముప్పేట దాడి చేస్తోంది.



కాంగ్రెస్ చేతిలో ఉన్న ఒక్కొక్క రాష్ట్రాన్ని కైవసం చేసుకుంటూ ముందుకెళ్తోంది. వరుసపెట్టి ఎన్నికల్లో గెలుపొందుతూ దూసుకెళ్తోంది. చాణక్యుడి రాజనీతితో పాటు అన్ని రకాల యుద్ధతంత్రాలను అమలు చేస్తూ గెలుపే పరమావధిగా ఆ పార్టీలో ప్రతి ఒక్కరూ కలసి కట్టుగా శ్రమిస్తున్నారు. కానీ అందుకు పూర్తి భిన్నమైన పరిస్థితి కాంగ్రెస్‌లో నెలకొంది. నేతలకు స్వార్థ ప్రయోజనాలు, పదవులు, తమ గెలుపు తప్ప పార్టీ గెలుపు ముఖ్యం కాదు. కొందరైతే ఉండేది ఇక్కడ (కాంగ్రెస్‌లో), పనిచేసేది మరో పార్టీ కోసం అన్నట్టుగా ఉన్నారు. ప్రత్యర్థి పార్టీలు ఇచ్చే తాయిలాలకు లొంగిపోయి సొంత పార్టీ ప్రయోజనాలను తాకట్టు పెట్టేస్తున్నారు. ఈ విషయం గ్రహించిన రాహుల్ గాంధీ.. పార్టీని సమూలంగా ప్రక్షాళన చేయాలని నిర్ణయించుకున్నారు.

ఇందుకోసం చేపట్టిన రెండ్రోజుల కసరత్తులో ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.కాంగ్రెస్ పార్టీలో నెలకున్న పరిస్థితులపై అవగాహన పెంచుకున్న రాహుల్ గాంధీ గుజరాత్ పర్యటనలో కుండబద్ధలు కొట్టినట్టు మాట్లాడారు. కాంగ్రెస్‌లో ఉంటూ బీజేపీ కోసం పనిచేస్తున్న నేతలు, కార్యకర్తలను గుర్తించాల్సిన అవసరం ఉందని అన్నారు. "గుజరాత్‌లో మా పార్టీలో రెండు రకాల కార్యకర్తలు ఉన్నారు. మొదటి రకం నిజాయితీగా పార్టీ కోసం శ్రమిస్తూ ప్రజలతో మమేకమై ఉన్నారు. రెండో రకం ప్రజలకు దూరంగా బీజేపీకి దగ్గరగా ఉన్నారు. ఆ పార్టీకి బీటీమ్‌గా పనిచేస్తున్నారు" అంటూ ఫైర్ అయ్యారు.

**గెలుపు కోసం బీజేపీ వంటి కొన్ని పార్టీలు అన్ని రకాల వ్యూహాలు, యుద్ధ తంత్రాలను అమలు చేస్తుంటాయి. ఆ క్రమంలో ప్రత్యర్థులను తమవైపు తిప్పుకోవడం ఒక వ్యూహం. అలాంటి వ్యూహాలకు సులభంగా చిక్కేది ఎవరంటే.. దేశంలోని కాంగ్రెస్ పార్టీ నేతలే. ఈ పరిస్థితి కేవలం గుజరాత్ వంటి రాష్ట్రానికే పరిమితం కాలేదు. తెలంగాణలోనూ కొందరు నేతలు భారత రాష్ట్ర సమితి కు కోవర్టులుగా పనిచేశారన్న ఆరోపణలు ఎదుర్కొన్నారు.**

గుజరాత్‌లో మూడు దశాబ్దాలుగా అధికారం అందుకోలేకపోవడానికి ఈ కోవర్టులే కారణమంటూ నిందించారు.

అలాంటి వారు 10 మంది నుంచి 40 మంది వరకు ఉన్నా సరే.. వాళ్లందరినీ పార్టీ నుంచి తొలగించి ఒక సందేశం పంపాలి అని రాహుల్ వ్యాఖ్యానించారు. రాజకీయాలు, చరిత్ర కాలంలో యుద్ధాలు ఒకటే. ప్రేమలో, యుద్ధంలో ఏదైనా సమంజసమే అని దానర్థం. గెలుపు కోసం బీజేపీ వంటి కొన్ని పార్టీలు అన్ని రకాల వ్యూహాలు, యుద్ధ తంత్రాలను అమలు చేస్తుంటాయి. ఆ క్రమంలో ప్రత్యర్థులను తమవైపు తిప్పుకోవడం ఒక వ్యూహం. అలాంటి వ్యూహాలకు సులభంగా చిక్కేది ఎవరంటే.. దేశంలోని కాంగ్రెస్ పార్టీ నేతలే. ఈ పరిస్థితి కేవలం గుజరాత్ వంటి రాష్ట్రానికే పరిమితం కాలేదు. తెలంగాణలోనూ కొందరు నేతలు భారత రాష్ట్ర సమితి కు కోవర్టులుగా పనిచేశారన్న ఆరోపణలు ఎదుర్కొన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ వెతికితే కోవర్టులు చాలా మంది కనిపిస్తారు. పార్టీ గెలిచే అవకాశం లేదన్న నిరాశ, నిస్పృహలు ఆవహించినప్పుడు ఈ తరహా పరిస్థితి ఎక్కువగా తలెత్తుతుంది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో రాజకీయాలు విపరీతమైన ఖర్చుతో కూడుకున్నాయి. తాను గెలిచినా పార్టీ ఓడితే.. ఎన్నికల్లో పెట్టిన ఖర్చు తిరిగి రాబట్టుకొనే అవకాశం ఉండదు.

ఇలాంటప్పుడు అధికారంలోకి ఉన్నవారితో చేతులు కలిపితే కనీసం పెట్టుబడి వెనక్కి వస్తుంది అన్నది కొందరి ఆలోచన. కొందరైతే ఇదంతా ఎందుకని.. ఏకంగా గెలుపొందిన తర్వాత పార్టీ ఫిరాయించి మరీ అధికార పక్షంలో చేరిపోతున్నారు. ఎలాగూ స్పీకర్ అధికారపక్షం నుంచే ఉంటారు కాబట్టి పదవీకాలం పూర్తయ్యేవరకు తమ అనర్హత వేటు వంటి చర్యలు ఉండవన్న భరోసా వారికి ఎలాగూ ఉంటుంది. కాంగ్రెస్ నుంచి ఫిరాయించిన స్థాయిలో బీజేపీ వంటి సైద్ధాంతికంగా బలంగా ఉన్న పార్టీల నుంచి జరగవు. అంటే కాంగ్రెస్ పార్టీలో తమ నేతలను కట్టిపడేసే సైద్ధాంతిక బలం కూడా లేదని అర్థమవుతోంది.కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ అన్న మాట తరచుగా వినిపిస్తూ ఉంటుంది. నిజమే. అది ఏ స్థాయిలో అంటే.. నేతలు పార్టీకి నష్టం కలిగినా ఫర్వాలేదు అన్న స్థాయిలో కుమ్మలాడుకునే స్థాయిలో అక్కడ ప్రజాస్వామ్యం ఉంటుంది. పార్టీ నాయకత్వాన్ని ప్రశ్నిస్తూ సవాళ్లు, విమర్శలు లేవనెత్తినా సరే అక్కడ చెల్లబాటవుతుంది. ఇటీవల హర్యానా, మహారాష్ట్ర మరియు ఢిల్లీ వంటి రాష్ట్రాల్లో జరిగిన అనేక అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత పార్టీలో జాతీయస్థాయిలో అంతర్గత కలహాలు, గందరగోళంతో పోరాడుతోందని స్పష్టంగా తెలుస్తుంది. శశి థరూర్ నుంచి ముంతాజ్ అహ్మద్ వరకు చాలా మంది సీనియర్ పార్టీ నాయకులు పార్టీలో తమ పాత్రలతో సంతోషంగా లేరని బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు.పార్టీ నాయకులు మాత్రమే కాదు, ఇండియా కూటమి సభ్యులు కూడా రాహుల్ నాయకత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ముందు ఇంట నెగ్గి, రచ్చ గెలవాలని.. ఆ క్రమంలో పార్టీలో ప్రక్షాళన చేపట్టి తనవెంట వచ్చే వారిని మాత్రమే ముందుకు తీసుకెళ్లాలని రాహుల్ గాంధీ చూస్తున్నారు. తన నాయకత్వంపై సందేహాలు వ్యక్తం చేస్తున్న నేతలను వదిలించుకునేందుకు ఎత్తుగడలు వేస్తున్నారు. అందులో భాగమే తాజా హెచ్చరికలని రాజకీయ పండితులు భావిస్తున్నారు.

# తెలంగాణకే తలమానికం



- చక్కర కర్మగారాన్ని నాశనం చేసిన ఘనత బీఆర్ఎస్ కే దక్కుతుంది
- ఎన్నికల్లో ఇచ్చిన హామీని కాంగ్రెస్ మర్చిపోయింది
- కాంగ్రెస్ ప్రభుత్వం పసుపునకు రూ. 12వేల మద్దతు ధర ఇవ్వాల్సిందే
- చెరుకు రైతుల కోసం ఉద్యమించేది బీజేపీ పార్టీ మాత్రమే
- బీజేపీ రాష్ట నాయకులు డాక్టర్ రఘు చిట్నేని
- మెట్ పల్లిలో చెరుకు రైతులకు మద్దతుగా బీజేపీ మహాధర్నా

**జయభేరి, మెట్ పల్లి :**

తెలంగాణకే తలమానికం... ఎన్డీఎస్ఎల్ కర్మగారాలు అని బీజేపీ రాష్ట్ర నాయకులు, డాక్టర్ రఘు చిట్నేని అన్నారు. మంగళవారం నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఇచ్చిన పిలుపు మేరకు మెట్ పల్లి పట్టణంలోని పార్టీ కార్యాలయం ఎదుట జాతీయ రహదారిపై బైఠాయించి రైతులు, రైతు సంఘ ప్రతినిధులతో కలిసి మహా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు గంటపాటు రహదారిపై బైఠాయించి ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ రఘు హాజరై మాట్లాడారు 1947లోనే బోధన్ లో ఎన్డీఎస్ఎల్ కర్మాగారం ప్రారంభమైందన్నారు. కొన్ని సంవత్సరాలు చెరుకు రైతులకు లాభదాయకంగా ఉన్న ఎన్డీఎస్ఎల్ ను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా 2015లో లే ఆఫ్ ప్రకటించి మూసివేసారన్నారు. దీంతో సుమారు 15 వేల ఎకరాల్లో పంటను చెరుకు రైతులు నష్టపోతున్నారన్నారు. కర్మగారాలను అర్ధంతరంగా మూసివేయడంతో చెరుకు రైతులకు ఉపాధి లేక వారితో పాటు, వారి పిల్లల సైతం ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.

కాగా 2013లోనే బీజేపీ ఆధ్వర్యంలో ముత్యంపేట చక్కర కర్మగారాన్ని తెరిపించాలని డిమాండ్ చేస్తూ మెట్ పల్లిలో రైతులతో కలిసి పార్టీలకతీతంగా ధర్నా కార్యక్రమం నిర్వహించామని గుర్తు చేశారు. ప్రస్తుతం కర్మాగారం మూతపడడంతో చెరుకు రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారన్నారు. అంతేకాకుండా తెలంగాణ రాష్ట్రానికి రెండు నవోదయ పాఠశాలలను మంజూరు చేయించిన ఘనత నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ దక్కుతుందన్నారు. ఒకటి కోరుట్ల నియోజకవర్గంలో, మరొకటి జక్రాన్ పల్లిలో మంజూరు చేయించామని, కానీ అక్కడి బోధన్ ఎమ్మెల్యే నిర్లక్ష్యం కారణంగా తాత్కాలికంగా నవోదయ పాఠశాలను ఏర్పాటు చేయలేకపోతున్నామని అన్నారు. జక్రాన్ పల్లిలో కాకుండా బోధన్ ఎమ్మెల్యే అవగాహన లేమితో బోధన్ షుగర్ ఫ్యాక్టరీ భూమిని కేటాయించారని, ఈ నిర్లక్ష్యానికి కారణంగా కేంద్ర ప్రభుత్వం తాత్కలికంగా నవోదయ పాఠశాలను ఏర్పాటు చేయడం నిలిపివేసిందన్నారు. గత, ప్రస్తుత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా సుమారు పదివేల మంది కార్మిక, కర్షక కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల ఏర్పాటు తాత్కాలికంగా ఆగిపోవడంతో విద్యార్థులు సైతం ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి చెరుకు రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వెంటనే చక్కర కర్మగారాన్ని తెరిపించాలని, కర్మాకారానికి సంబంధించిన భూములను అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని డిమాండ్ చేశారు.

ఇదిలా ఉండగా ఆది నుంచి రైతుల సంక్షేమానికి బీజేపీ ఆధ్వర్యంలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ కృషి చేస్తూనే ఉన్నారని గుర్తు చేశారు. ఆయన కృషి మేరకు పసుపు బోర్డును సాధించుకున్నామని, పసుపు రైతుల సంక్షేమానికి పార్టీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు, ధర్నా కార్యక్రమ కన్వీనర్, రాష్ట్ర నాయకులు ఏలేటి నరేందర్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్ గౌడ్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చెట్లపల్లి మీనా సుఖేందర్ గౌడ్, నరేష్, రాష్ట్ర ఓబీసీ ఉపాధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేష్, బీజేపీ నాయకులు, రైతు సంఘం నాయకులు బద్దం శ్రీనివాస్ రెడ్డి, గుంటుక సదాశివ్, వడ్డేపల్లి శ్రీనివాస్, పంచిరి విజయ్, రాజ్ పాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బింగి వెంకటేష్, దొనికెల నవీన్, డాక్టర్ వెంకట్ రెడ్డి, పీసు రాజేందర్ రెడ్డి, బత్తుల శ్రీనివాస్, బొడ్ల నరేష్, గుగ్గిళ్ళ తుకారం గౌడ్, బొడ్ల ఆనంద్, పన్నాల రాఘవరెడ్డి, బొడ్ల గౌతమ్, జక్కుల జగదీష్, సదాశివ్, మహేష్, బొమ్మెల శంకర్, జుంగల ఆనంద్, రమేష్ యాదవ్, శ్రీనివాస్, సుంచు రణధీర్, రాజారెడ్డి, కొయ్యల లక్ష్మణ్, శ్రీధర్ రెడ్డి, చెట్లపల్లి సాగర్, కలాల సాయిచందు, ఇట్యాల నవీన్, కుడుకల రఘు, కలిగోట శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రూప్ 2 పరీక్షల ఫలితాలు విడుదల

**జయభేరి, హైదరాబాద్, మార్చి 11 :**

గ్రూప్ 2 అభ్యర్థుల పరీక్షల ఫలితాలు టీజీపీఎస్సీ మంగళవారం విడుదల చేసింది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 783 గ్రూప్ 2 పోస్టులు 2024 డిసెంబర్ 15, 16 తేదీలలో పరీక్ష నిర్వహించారు. గ్రూప్ అభ్యర్థుల మార్కులను, జనరల్ ర్యాంకు జాబితాను తాజాగా టీజీపీఎస్సీ ప్రకటించింది. గ్రూప్ 2 పరీక్షకు హాజరైన అభ్యర్థులు అధికారిక వెబ్సైట్లో ఫలితాలు చెక్ చేసుకోవాలని టీజీపీఎస్సీ చైర్మన్ వెంకటేశం సూచించారు. ఎలాంటి హాల్ టికెట్ నెంబర్, పుట్టిన తేదీ వివరాలను ఎంటర్ చేయకుండా అభ్యర్థులు ఫలితాలు చెక్ చేసుకోవచ్చు. గ్రూప్ 2 ఫలితాల కోసం క్లిక్ చేయండి. రిజల్ట్ పేజీ క్లిక్ చేసిన తరువాత ఓపెన్ అయిన పీడీఎఫ్ లో మీ హాల్ టికెట్ నెంబర్ ఎంటర్ చేసి రిజల్ట్ చూసుకోండి. ఇందులో ఎలాంటి నెగటివ్ మార్కింగ్ లేదు. టీజీపీఎస్సీ సోమవారం నాడు గ్రూప్ 1 మెయిన్స్ రాత పరీక్షా ఫలితాలు విడుదల చేసింది. ఫలితాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే అభ్యర్థులు రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేయాలి. ఆ ప్రాసెస్ పూర్తి అయిన తరువాత 1:2 నిష్పత్తిలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ కు ఫలితాలు విడుదల చేయనున్నారు. గ్రూప్ 2 ఫలితాలపై అభ్యంతరాలు లాంటివి వస్తే.. అంతా పూర్తిచేసి సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం మరో రిజల్ట్ విడుదల చేస్తారు. టీజీపీఎస్సీ అధికారిక వెబ్ సైట్తెలంగాణ ఏర్పాటయ్యాక ఒకసారి గ్రూప్ 2 పోస్టులు భర్తీ చేశారు. గత ఏడాది గ్రూప్ 2 నిర్వహించినా పేపర్ల లీకులతో పలు ఎగ్జామ్స్ ఫలితాలు రద్దు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం టీజీపీఎస్సీలో ప్రక్షాళన చేపట్టి గ్రూప్2 నోటిఫికేషన్ విడుదల చేసింది. గత ఏడాది డిసెంబర్ నెలలో పరీక్ష నిర్వహించి మార్చి 11న మార్కుల వివరాలు, జనరల్ ర్యాంకింగ్స్ రిలీజ్ చేసింది. గ్రూప్ 2 పరీక్ష ద్వారా మున్సిపల్ కమిషనర్, సబ్‌రిజిస్ట్రార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, ఏసీటీవో, తహసిల్దార్, మండల పంచాయతీ అధికారి, ప్రొహిబిషన్ & ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్, డిస్ట్రిక్ట్ ప్రొబేషన్ ఆఫీసర్, అసిస్టెంట్ బీసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్, అసిస్టెంట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్, అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేయనున్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

- చందుపట్ల రాజిరెడ్డి, మార్కెట్ చైర్మన్
- పరకాల రెండో వార్డులో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం



**జయభేరి, పరకాల, మార్చి 11:**

పరకాల నియోజకవర్గ శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశాలతో పరకాల మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డులో పరకాల పట్టణ అధ్యక్షులు కోయ్యడ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ పార్టీ సర్వసభ్య సమావేశంనిర్వహించడం జరిగింది. ఈ సమావేశం ను ఉద్దేశించి పరకాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, డైరెక్టర్ బొమ్మకంటి రుద్రమ దేవి లు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరూ ఐక్యతతో కృషి చేయాలని, కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల కోసం పనిచేస్తూ అనేక సంక్షేమ పథకాలను ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం నిలబెట్టుకుంటూ రాష్ట్రంలోని అన్ని వర్గాలకు గృహ జ్యోతి పథం ద్వారా ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, మహాలక్ష్మి పథం ద్వారా మహిళలకు ₹500/రూ:లకు గ్యాస్ పంపిణీ, కల్యాణ లక్ష్మి, షాదిముబారక్, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, మహిళా సంఘాలకు రుణాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే ప్రజా పాలన ప్రభుత్వం అమలు చేసిందని దీనిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళాలి సూచించారు. అంతేకాకుండా ఇంటిగ్రేటెడ్ గురుకులపాఠశాలకు 200కోట్ల రూపాయల బడ్జెట్ మంజూరు చేయించిన ఘనత మన పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి దేనని, పరకాల నియోజకవర్గం లో అభివృద్ధి ప్రదాతగా ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి దేనని, అంతేకాకుండా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో పై పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ దేశంలో ప్రప్రథమంగా కుల జనగణన సర్వే చేసిన ఘనత రేవంత్ రెడ్డికే దక్కింది. బిసి కుల గణన, ఎస్ సి వర్గీకరణ విషయంలో సమర్థవంతంగా పని చేసినారు. వార్డులోని ప్రతి ఇంటిని సర్వే చేయడం జరిగింది.

రాష్ట్రంలో కుల జన గణన సర్వే చేసినందుకు, 30 సంవత్సరాల కాలంలో ఉద్యమ స్ఫూర్తితో ఎస్సీ వర్గీకరణ కోసం దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని ఖ్యాతి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణ కోసం ఆమోదం తెలిపినందుకు కృతజ్ఞతలు తెలిపుతు గ్రామంలో పలు అభివృద్ధి పనులు, పేద ప్రజలకు కావలసిన సంక్షేమ పథకాలు అందజేసేలా, వాడలోని సి సి రోడ్లు డ్రైనేజీ, కావాలని తీర్మానం చేసి హాజరైన కార్యకర్తలు, ప్రజలు సంతకాలు చేసి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి కి పంపించారు. ఈ కార్యక్రమంలో కుంకుమేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ కోలుగురి రాజేశ్వరరావు, ఉమ్మడి పరకాల ఎస్సీ విభాగం అధ్యక్షులు బొమ్మకంటి చంద్రమౌళి సమన్వయ కమిటీ సభ్యులు ఒంటేరు రామ్మూర్తి, ఎండి రంజాన్ అలీ, దుబాసి వెంకటస్వామి, మార్క రఘుపతి గౌడ్, పసుల రమేష్, బండి సదానందం గౌడ్, కాంగ్రెస్ నాయకులు ఒంటేరు చిన్న సారయ్య, బొచ్చు మోహన్, పరకాల పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పోరండ్ల వేణు, గడ్డం శివ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, వార్డు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## విమర్శలు ఆపండి.. అభివృద్ధి చేయండి...

- మాజీ ఎఫ్డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి

**జయభేరి, గజ్వేల్, మార్చి 11:**

రేవంత్ రెడ్డి వారసులు పదే పదే గత ప్రభుత్వంపై విమర్శలు చేయడం మానుకొని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కెసిఆర్ ను, హరీష్‌రావును తిట్టడం బిఆర్ఎస్ ప్రభుత్వంపై నిందలు మోపడం పనిగా పెట్టుకున్నారని మాజీ ఎఫ్డి సి చైర్మన్ ప్రతాప్ రెడ్డి అన్నారు. ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు కాని 420 హామీలపై దృష్టి పెట్టకుండా కెసిఆర్ పై సంస్కారం లేకుండా మాట్లాడుతున్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కేసీఆర్ ప్రభుత్వం సిద్దిపేట జిల్లాలో తల మాణికం లాగా మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, రంగనాయక సాగర్ నిర్మాణం చేసి మండుటెండల్లో సైతం చెరువులను కుంటలను చెక్ డ్యాంలను మత్తళ్లను గోదావరి జలాలతో పారించి ఒక గుంట కూడా ఎండిపోకుండా చూసి రైతుల ముఖంలో సంతోషం నింపిన ఘనత కెసిఆర్ ప్రభుత్వాన్ని అని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కళ్ళ ఎదురుగా సమస్యలు కనిపిస్తున్న రైతుల పొలాలు ఎండిపోతున్న, చెరువులు ఎండిపోతున్న, కాలువలు ఎడారులుగా మారుతున్న వాటిపై దృష్టి పెట్టకుండా రైతులకు సాగునీరును అందించడంలో విఫలమై రైతు కష్టాలపై మాట్లాడకుండా రైతులు కన్నీరు పెడుతున్న కనీసం కనికరించకుండా రైతుల ఎండిపోతున్న పొలాలను పరిశీలించకుండా కేవలం పనిగట్టుకొని కెసిఆర్, హరీష్‌రావు పై సంస్కారం లేకుండా సంస్కారహీనులుగా మాట్లాడటం సిగ్గుచేటని తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గం లో పెండింగ్లో ఉన్న పనుల కోసం గత ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల కోసం 180 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గజ్వేల్ నియోజకవర్గం అభివృద్ధిని తుంగలోకి తొక్కి అభివృద్ధిని అడ్డుకొని 180 కోట్ల నిధులను రద్దు చేసి కొడంగల్ నియోజకవర్గానికి తీసుకెళ్లిన ఘనత రేవంత్ రెడ్డి ది అన్నారు. 180 కోట్ల రూపాయలను వెంటనే మంజూరు చేయించి గజ్వేల్ లో పెండింగ్ లో ఉన్న పనులను పూర్తి చేసి రెండు హాస్పిటలలో మిగిలిన పనులను పూర్తి చేసి అందుబాటులు తేవాలని డిమాండ్ చేశారు. 10 శాతం మిగిలిపోయిన ఆర్ అండ్ ఆర్ కాలనీ నిర్వాసితుల సమస్యలను కూడా వెంటనే మానవతా దృక్పథంతో స్పందించి 100 కోట్ల నిధులను విడుదల చేసి నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కళ్ళు తెరిచి మల్లన, కొండపోచమ్మ, రంగనాయక సాగర్ రిజర్వాయర్ల ద్వారా రైతాంగానికి అందించి ఈ రిజర్వాయర్లకు కింద ఉన్న పెండింగ్ లో ఉన్న కాలువలను వెంటనే పూర్తి చేసి వాటి ద్వారా కూడా రైతులకు సకాలంలో సాగునీరు అందించాలని అన్నారు.

## ఓవర్ స్పీడ్ తో మరో ఇంజినీరింగ్ విద్యార్థి బలి

**జయభేరి, రంగారెడ్డి :**

అతి వేగం ఒక విద్యార్థి ప్రాణం తీసింది. నార్సింగి మూవీ టవర్ వద్ద ఘటన జరిగింది. కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న ఒక్కరు మృతి చెందారు. ఐదుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న విద్యార్థులంతా సిబిఐటి కళాశాలకు చెందినవారు. బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణం అని పోలీసులు అంటున్నారు. క్షతగాత్రులను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. వీరంతా గండిపేట్ కళాశాల నుండి హైదరాబాద్ వెళుతుండగా ప్రమాదం జరిగింది.

## ఎమ్మెల్యే.. జోనల్ కమిషనర్ సుడిగాలి పర్యటన

**జయభేరి, కాప్రా :**



జీహెచ్ఎంసీ కమీషనర్ ఇలంబర్తి ఆదేశాల మేరకు మీర్పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ లోని బండబావి ప్రాంతంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ తో కలిసి ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్ పర్యటన. బండబావి స్థలంలో మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం గురించి.. తదితర అంశాలపై జోనల్ కమిషనర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలపై పూర్తి వివరాలు తెలుసుకున్న జోన్ కమిషనర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే కార్యచరణ చేపడుతామని, ప్రణాళిక ప్రకారంగా ముందుకు వెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి, ప్రాజెక్ట్స్ సీఈ భాస్కర్ రెడ్డి, ఎస్ఈ నిత్యానంద, స్పోర్ట్స్ వెంకట్ రెడ్డి, ఈఈ నాగేందర్, ప్రాజెక్ట్స్ డీఈ ఉమారాణి, ప్రాజెక్ట్స్ ఈఈ రోహిణీ, ఏఈఈ భరత్ భూషణ్, డీఈ రూప, ఏఈ లింగరావ్, వర్క్ ఇనస్పెక్టర్ శ్రీనివాస్ మరియు స్థానిక నాయకులు గుమ్మడి జంపాల్ రెడ్డి, మధు ముదిరాజ్, భానురి రాకేష్, వేణు గౌడ్, వాసుచారి, శ్యామ్, రాజు, సాయి, నరసింహ గౌడ్, కృష్ణ, బాలయ్య గౌడ్, చారి, నవీన్ గౌడ్, కుమార్, నిసార్ అహ్మద్ గోరి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి
- చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే

**జయభేరి, పరకాల, మార్చి 11:**




మంగళ వారం పరకాల పట్టణంలోని ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయం నందు పరకాల టౌన్ & మండలం, నడికూడ, ఆత్మకూర్, దామెర మండలాలకు చేసిన అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముభారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకుఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ.. సిఎంఆర్ఎఫ్ పేద ప్రజలకు వరమని, గతంలో ఎమ్మెల్యే, ఎంపిల కార్యాలయాల వద్ద చెక్కుల కోసం పడిగాపులు కాచేవారని నేడు లబ్దిదారులకు నేరుగా అందజేయడం జరుగుతుందని అన్నారు. పేదింటి ఆడబిడ్డలకు అండగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు నిలుస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక పరకాల నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు మొత్తం కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ ద్వారా ఆర్థిక సహాయం 1556మందికి 15 కోట్ల 57 లక్షల 78వేల 496 రూపాయలు, సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా 1173 మంది లబ్ధిదారులకు 3కోట్ల 68 లక్షల 61 వేల రూపాయలను, ఎల్ఓసి పథకం ద్వారా 69 మందికి 1 కోటి 33 లక్షల 91వేల రూపాయల విలువ గల చెక్కులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహాయంతో పంపిణీ చేసామని అన్నారు. గత ప్రభుత్వంలో లబ్ధిదారులకు కనీసం సీఎంఆర్ఎఫ్ నిధులు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పెండింగ్ వాటిని కూడా మంజూరు చేశామని అన్నారు. నిరుపేదలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందని అన్నారు. పరకాల నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు 200 కోట్ల నిధులు కేటాయించిన సందర్భంగా ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కి ధన్యాదములు తెలిపారు. అనారోగ్య కారణాలతో ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారికి ప్రభుత్వం తరపున బాధ్యతగా నేరుగా ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ద్వారా ఆర్థిక సాయం అందజేస్తున్నామని తెలిపారు. పార్టీలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తూ, అర్హులైన పేదలకు న్యాయం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలోనే జరుగుతుందని అన్నారు.

## సమాజ మార్పుకు జర్నలిస్టు, పోలీసుల పాత్ర కీలకం

- గజ్వేల్ ఏసిపి పురుషోత్తం రెడ్డి

**జయభేరి, గజ్వేల్, మార్చి 11:**



సమాజంలో జరిగే అసాంఘిక కార్యకలాపాలు రూపుమాపే జర్నలిస్టులు బాధ్యత గల జర్నలిస్టులు అని మెరుగైన సమాజ నిర్మాణంలో జర్నలిస్టులు పోలీసుల పాత్ర కీలకమని గజ్వేల్ ఏసిపి పురుషోత్తం రెడ్డి అన్నారు. తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ డైరీ క్యాలెండర్ ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బింగి స్వామి అందించగా సమాజంలో జరిగే ఆ సాంఘిక కార్యకలాపాలను తమ దృష్టికి తీసుకురావాలని వాటిని రూపుమాపేందుకు పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. చట్టం పరిధిలో ప్రజలు పనిచేయాలని మద్యం మాదకద్రవ్యాలు పేకాట గొడవలు లాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండి మెరుగైన సమాజ నిర్మాణంలో పౌరులందరూ బాధ్యతగా ఉండాలని పిలుపునిచ్చారు. పోలీసులు రక్షణ కవచంగా నిరంతరం పనిచేస్తున్నారని దానికి జర్నలిస్టులో బాధ్యతగా సహకారం అందిస్తున్నారని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరగకుండా జర్నలిస్టులు తమ దృష్టికి తీసుకువచ్చి మెరుగైన సమాజంలో తమ వంతు కృషి చేస్తున్నారని అభినందించారు. విద్యార్థిని విద్యార్థులు విద్యపై తమ దృష్టి సాధించి ఉన్నత లక్ష్యాలను ఛేదించాలని విద్యతోటే మెరుగైన సమాజానికి బాటలు పడతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ మహేందర్ రెడ్డి జర్నలిస్ట్ లు గుడాల శేఖర్, ఎల్లం రాజు, మహేష్ లు పాల్గొన్నారు.



## ఎంబీబీఎస్ విద్యార్థులకు ఎమ్మెల్యే బాసటగా నిలవడం అభినందనీయం

- పరిశ్రమలు ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు
- మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా 13 మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు 5 లక్షల 21 వేల రూపాయల చెక్కుల పంపిణీ

**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఎంబీబీఎస్ సీటు సాధించిన వారికి ఫీజు చెల్లించడం నిజంగా అభినదనీయం అని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి వచ్చిన ఆయన ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న బండారి లక్ష్మారెడ్డిని అభినందించారు.

## కలెక్టర్ ఆఫీస్ వద్ద నిరసన




**జయభేరి, గజ్వేల్, మార్చి 11:**

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశానుసారం మంగళవారం సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి, ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టడం జరిగింది. 30 సంవత్సరాల ఉద్యమ పోరాటంలో జనాభా తమాషా నిష్పత్తి ప్రకారంగా ఎస్సీ ఏబిసిడి వర్గీకరణ జరగాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తుంటే ఆగస్టు 1 న 2024 నాడు సుప్రీంకోర్టు రాష్ట్రాల వారిగా వర్గీకరణ చేసుకోవచ్చని తీర్పు ఇవ్వడంతో నిండు అసెంబ్లీ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొచ్చి ఉద్యోగాల నియామకాలు చేపడతామని హామీ ఇచ్చి ఇచ్చిన మాటను తప్పి టి జి పి ఎస్ సి ద్వారా గ్రూప్ 1,2,3 లో పరీక్ష ఫలితాలను విడుదల చేయడం ద్వారా మాదిగ మాదిగ ఉపకులాలకు అన్యాయం జరుగుతుందని నేపథ్యంలో సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఆఫీసు వద్ద నిరసన దీక్ష చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు లింగంపల్లి శ్రీనివాస్ మాదిగ, మల్లిగారి యాదగిరి మాదిగ, పేరక పరుశరాములు మాదిగ, ఎం ఎస్ పి సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సామ్రాట్ ప్రకాష్ మాదిగ, ఎం ఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షులు ముక్కపల్లి రాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి పిన్నింటి శ్రీహరి, ఎం ఎస్ పి జిల్లా ఉపాధ్యక్షుడు కందికట్ల రాజు మాదిగ, జిల్లా సహాయ కార్యదర్శి రడం రాజు మాదిగ, భోగి కనకయ్య, మచ్చ సామెల్ మాదిగ, జెవిఎన్ ప్రసాద్ మాదిగ, మాదాసు బాబు మాదిగ, దెబ్బెట శ్రీనివాస్ మాదిగ, బాకురి అశోక్ మాదిగ, కళాకారుల జిల్లా ఉపాధ్యక్షుడు అందెలి బాలరాజు మాదిగ, రవి మాదిగ, శ్రీను మాదిగ, జుట్టు రజినీకార్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద ఎత్తున కోళ్ల మృతి

- వర్గల్ మండలం మజీద్ పల్లిలో 8వేలకు పైగా కోళ్ల మృతి
- పరీక్షలు నిర్వహించిన వెటర్నరీ వైద్యులు



**జయభేరి, గజ్వేల్, మార్చి 11:**

8 వేల కోళ్లు మృతి చెందిన ఘటన. వర్గల్ మండలం మజీద్ పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. మంగళవారం ఒక పౌల్ట్రీ ఫామ్ లో 8000 పైగా కోళ్లు మృతి చెందాయి. కోళ్ల ఫారం నిర్వహిస్తున్న పౌల్ట్రీ రైతు ఎస్.కె అలీ ఈ సందర్భంగా మాట్లాడుతూ పౌల్ట్రీ ఫారం ను లీజుకు తీసుకొని 10వేల కోళ్లను పెంచుతున్నానని చెప్పాడు. 21 రోజుల నుండి కోళ్లు మెల్లిమెల్లిగా అనారోగ్యం బారిన పడుతున్నాయని గడచిన రెండు రోజుల్లోనే 8000 పైగా కోళ్లు మృతి చెందాయన్నారు. వెటర్నరీ వైద్యులు కోళ్లను పరిశీలించారన్నారు. మరో రెండు రోజుల్లో మిగిలిన కోళ్లు కూడా మృతి చెందుతాయన్నారు. కోడి పిల్లలను అందించిన కంపెనీ ఎలాంటి నష్టపరిహారం ఇవ్వమని చెప్పారని, ప్రభుత్వమే ఆదుకొని తనకు సహాయం అందించాలని ఆలీ కోరారు.

## శ్రీ మద్దెలమ్మ దేవాలయానికి విరాళం

- జాలే నరసింహారెడ్డి



**జయభేరి, చందంపేట :**

చందంపేట మండలం సంబంధించిన వివిధ గ్రామాల నాయకులు పట్టణము నివసిస్తున్న ప్రతి ఒక్కరు తోచిన సాయంగా అందిస్తూ దేవరకొండ పట్టణంలోని మహబూబ్ నగర్ రోడ్డు లో కోలువుదీరిన శ్రీ మద్దెలమ్మ దేవాలయ నిర్మాణానికి చిత్రియాల శ్రీమంతులు నాయకులు జాలే నరసింహారెడ్డి పీసీసీసభ్యులు &. పిఎసిఎస్ చైర్మన్ 100,116 రూ.,, ఒక లక్ష నూట పదహారు రూపాయలు విరాళంగా ఇవ్వడం జరిగింది అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. మద్దెలమ్మ దేవాలయ కమిటీ తరపున, దేవరకొండ యాదవ సంఘం తరుపున జలే నరసింహా రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదములు తెలుపుతూ వారి కుటుంబ సభ్యులపైన ఆ మద్దెలమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లపుడూ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జాని యాదవ్, నక్కవెంకటేష్ యాదవ్, నేతాల వెంకటేష్ యాదవ్, దేవరకొండ యాదవ సంఘం అధ్యక్షుడు నల్లగాసు విజయ్ కుమార్ యాదవ్, శవ్వ వెంకటయ్య యాదవ్, బచ్చబోయిన యాదయ్య యాదవ్, నేతాల నరసింహ యాదవ్, వెంకటేష్ డిష్, కన్నెబోయిన మల్లయ్య యాదవ్, నక్క వెంకటేష్ సిరమోని రాములు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

■ పూర్వ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్

**జయభేరి, పరకాల, మార్చి 11:**



విద్యారంగా సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్న భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) పూర్వ విద్యార్థుల సమ్మేళనం మార్చి 23న, హనుమకొండ కాలోజీ కళాక్షేత్రం జరుగుతుందని దాన్ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ పూర్వ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ పిలుపునిచ్చారు.

మంగళవారం పరకాల పట్టణంలో ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సన్నహక సమావేశం మాజీ ఎస్ఎఫ్ఐ పరకాల డివిజన్ బాధ్యులు సీనియర్ జర్నలిస్ట్ దామెర రాజేందర్ అధ్యక్షతన జరిగింది.

ఈ కార్యక్రమానికి హాజరైన రాగుల రమేష్ మాట్లాడుతూ చదువుతూ పోరాడు చదువుకై పోరాడు అనే నినాదంతో ఎస్ఎఫ్ఐ ఏర్పడి విద్యారంగ సమస్యల మీద అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. 1970లో ఏర్పడిన ఎస్ఎఫ్ఐ నాటి నుండి నేటి వరకు ఎందరో నాయకులను సమాజానికి అందించిందన్నారు. ఈ క్రమంలో 1970 నుండి 2016 వరకు వరంగల్ ఉమ్మడి జిల్లాలో పనిచేసిన ఎస్ఎఫ్ఐ పూర్వ నాయకులను సమీకరించి మహా సమ్మేళనాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. భగత్ సింగ్ స్పూర్తితో పనిచేస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాన్ని ఆయన వర్ధంతి రోజున నిర్వహించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయడం కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేసినటువంటి ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

సమావేశా అనంతరం ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ వరంగల్ ఉమ్మడి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శులు జి.గంగాధర్, డి. తిరుపతి, పరకాల డివిజన్ మాజీ ప్రధాన కార్యదర్శి బొట్ల నరేష్, అంకేశ్వరపు ఐలయ్య, వరంగల్ ఏఎంసి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆకుల రుద్ర ప్రసాద్, నక్క చిరంజీవి, మైస సురేందర్, కోగిల చంద్రమౌళి, తుడుం క్రాంతి, బొల్లారం సంపత్, జి.కరుణాకర్, దొగ్గెల. కుమార్, ఏ. ప్రశాంత్ వైద్య, నాగుల కుమార్, యం. రవి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకున్న పోలీసులు

**జయభేరి, ములుగు, మార్చి 11 :**

ప్రభుత్వ అనుమతి లేకుండా మట్టిని టిప్పర్లు లలో నింపుకొని అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్లను మరియు జెసిబి ని సిద్దిపేట టాస్కోర్స్ మరియు ములుగు పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకెళ్తే ములుగు గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు కలిసి TS08UF 9613, TS36T 6304, TS36T 7326, AP23AH 9643 గల వాహనాలు, ఒక జెసిబి కలిపి ములుగు గ్రామ శివారులో ఉన్న గురుకుల రెసిడెన్షియల్ స్కూలు వెనుక భాగంలో ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా మట్టి తవ్వి టిప్పర్ల ద్వారా నింపుకొని అక్రమ వ్యాపారం చేస్తున్నారని నమ్మదగిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్ ఫోర్స్ మరియు ములుగు పోలీసులు వెళ్లి పట్టుకున్నారు. ములుగు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## ఓ ఆర్ ఆర్ వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

■ ఇద్దరిని అదుపులోకి తీసుకున్న ఎస్ ఓ టీ పోలీసులు



**జయభేరి, మార్చి 11:**

గుట్టు చప్పుడు కాకుండా అక్రమంగా పీడీఎస్ బియ్యం రవాణా చేస్తున్న వ్యక్తులను శామీర్ పేట పోలీసులు పట్టుకున్నారు. నందిగామకు చెందిన డ్రైవర్ ఎస్ కె సర్దార్, క్లీనర్ చంద్రం సుమారుగా 24 టన్నుల రేషన్ బియ్యాన్ని ఆటోనగర్ మలక్ పేట నుండి సిద్దిపేటకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో వీరి వాహనం శామీర్ పేట అవుటర్ రింగ్ రోడ్డు వద్దకు రాగానే పోలీసులు వీరి వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారని నిర్ధారించారు. ఈ మేరకు నిందితులను అదుపులోకి తీసుకుని రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పేట్ బషీర్ బాగ్ ఏసిపి రాములు వెల్లడించారు. ఎవరైనా అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## ఎమ్మెల్యేని కలిసిన శామీర్ పేట కట్ట మైసమ్మ ఆలయ కమిటీ సభ్యులు

■ ఆలయ అభివృద్ధికి సహకరించాలని వినతిపత్రం సమర్పణ



**జయభేరి, మార్చి 11:**

మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డిని శామీర్ పేట కట్ట మైసమ్మ ఆలయ కమిటీ సభ్యులు ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల ఆలయ కమిటీని నూతనంగా ఎన్నుకోవడంతో ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పించారు. కాగా దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## లింగమంతుల స్వామి బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరన

■ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



**జయభేరి, పీ ఏ పల్లి :**

పీ ఏ పల్లి మండల కేంద్రంలో ఈనెల 16వ తేదీ నుండి 17 వరకు జరగనున్న శ్రీ లింగమంతుల స్వామి బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్ ను ఈరోజు దేవరకొండ క్యాంపు కార్యాలయంలో శాసన సభ్యులు నేనావత్ బాలు నాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. భక్తులకు భగవంతుని దివ్య అనుగ్రహాన్ని పొందే గొప్ప అవకాశం బ్రహ్మోత్సవాలలో కలుగుతుందని అన్నారు. ప్రజలలో భక్తి భావాన్ని పెంచి, మన శ్యాంతిని పెంపొందించే విధంగా పండుగలు జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్, పీఏ పల్లి మాజీ యంపీపి తేర సత్యనారాయణ రెడ్డి, మాజీ పీఏసీఎస్ ఛైర్మన్ తేర మణిపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ సైదమ్మ, శ్రీనివాస్ యాదవ్, గ్రామ నాయకులు బొలిగొర్ల కొండల్ యాదవ్, ఎల్లెష్ యాదవ్, పిల్లి కృష్ణయ్య యాదవ్, చల్ల అన్వేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రణయ్ హత్యకేసుపై కోర్టుతీర్పును స్వాగతిస్తున్నాం

■ కేవిపిఎస్

**జయభేరి, హన్మకొండ, మార్చి 11:**




కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం హనుమకొండ జిల్లా రాంనగర్ సుందరయ్య భవన్ కార్యాలయంలో మంగళవారం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కె వి పేస్ జిల్లా ఉపాధ్యక్షులు దూడపాక రాజేందర్ అధ్యక్షత వహించగా జిల్లా ప్రధానకార్యదర్శి మంద సంపత్ హాజరై మాట్లాడుతూ మీడియా ద్వారా ప్రణయ్ హత్య కోర్టు తీర్పుని స్వాగతిస్తున్నామని చెపుతూ, 2018లో మిర్యాలగూడలో హాస్పిటల్ చికిత్స నిమిత్తం తిరిగి వెళుతున్న ప్రణయ్ ని అతి దారుణంగా హత్య చేసిన దుండగులను శిక్షించాలని రాష్ట్రవ్యాప్తంగా దేశవ్యాప్తంగా కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం పోరాటం నిర్వహించిందని, ఈ యొక్క పోరాట ఫలితంగానే ఈ రోజున కోర్టు తీర్పు అని, దుండగులలో A1, A2, లకు కోర్టు ఉరిశిక్ష అమలు చేయడం జరిగింది. మిగతా ఆరుగురికి జీవిత ఖైదీలుగా తీర్పునివ్వడాన్ని కులవివేక్ష వ్యతిరేక పోరాట సంఘంగా హర్షం వ్యక్తం చేస్తూ కులాంతర వివాహాల చట్టాలు వచ్చినప్పటికీ రాజ్యాంగబద్ధంగా ప్రతి పౌరుడు ఎలాంటి కులం మతం ప్రాంతం బేధం లేకుండా జీవించాలనే భారత రాజ్యాంగంలో ఉన్న హక్కులను కాలరాస్తున్న నేపథ్యంలో నిరంతరం కులమత భావాలు లేకుండా జీవించాలని పోరాటం చేస్తుంది అని ఆయన అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రేమ వివాహాలు చేసుకున్న హత్యలను అరికట్టే విధంగా హక్కులను కాపాడే విధంగా ఆందోళన పోరాటాలని పాలకవర్గాల వైఫల్యాలని ప్రభుత్వ విధానాలని అందుబాటులో ఉండే విధంగా నిరంతరం కృషి చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా పోలీస్ వ్యవస్థ కి న్యాయవ్యవస్థకి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేస్తూ న్యాయం ఇంకా ఉన్నది, ఉండాలని ఈ తీర్పు ద్వారా అర్థం అవుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు రేణిగుంట్ల చందర్ సిఐటియు నాయకులు ఆలకుంట మల్లయ్య విద్యార్థి నాయకులు కళ్యాణ్ స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.



## 6 క్వింటల్ల పిడిఎఫ్ బియ్యం పట్టివేత

**జయభేరి, డిండి :**

డిండి మండలం చెరుకుపల్లి గ్రామంలో బోయిని రమేష్ నివాసంలో 6 క్వింటాళ్ల పిడిఎస్ అక్రమంగా అమ్మడానికి బియ్యం నిల్వ ఉంచినాడని సమాచారం మేరకు పట్టుకొని సమీపంలో ఉన్న డీలర్ కు బియ్యమును అందజేసినారు. ప్రజలకు తెలియజేయునది ఏమనగా మీరు స్వయంగా తినదలుచుకుంటూనే బియ్యాన్ని తీసుకోండి లేకపోతే తీసుకోవద్దు దళారులకు అమ్మవద్దని సివిల్ సప్లై ఆఫీసర్ శ్రీనివాస్ గౌడ్ సూచించినారు పిడిఎస్ బియ్యం వ్యాపారం చేసేవారికి హెచ్చరిస్తున్నాము ఇలాంటి వ్యాపారాలు చేయొద్దని తెలియజేసినారు.



# ఇసుక రీచ్ కు ప్రభుత్వం అనుమతి

■ అనుమతిని రద్దు చేయాలనీ దేవరకొండ RDO కి వినతిపత్రం ఇచ్చిన గ్రామస్తులు

**జయభేరి, దేవరకొండ :**



దేవరకొండ మండలం తాటికొల్ గ్రామపంచాయతీ పరిధిలోని వాగులో ఇసుక రీచ్ కు ప్రభుత్వం ఇచ్చిన అనుమతిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేవరకొండ RDO కి తాటి కోల్ గ్రామస్తులు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. గతంలో కూడ 2018లో TSMDC ప్రైవేట్ వ్యక్తికి ఇసుక రవాణ కోసం అనుమతి ఇవ్వడంతో గ్రామస్తులు ఏకమై అడ్డుకోవడం జరిగింది. తాటి కోల్ వాగు నుండి పెద్ద ఎత్తున ఇసుక తరలించడంతో భూగర్భ జలాలు ఎండిపోవడం జరుగుతుందని, వాగు మీద ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులు రోడ్డు మీద పడే ప్రమాదం వుందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే గ్రామ ప్రజలకు సాగు, త్రాగు నీటికి ప్రధాన నీటి వనరు అయిన వాగులో ఇసుక రవాణా చేస్తే భూగర్భ జలాలు తగ్గి తీవ్ర కరువు పరిస్థితులు ఎదుర్కోవల్సి వస్తున్నందున ఇసుక రవాణాను వెంటనే నిలిపి వేయాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు ఈ కార్యక్రమంలో తాటి కోల్ గ్రామస్తులు పాల్గొన్నారు.




# గ్రామ అభివృద్ధి కొరకు కృషి చేస్తా..

■ పాలవరం గ్రామ యూత్ అధ్యక్షుడిగా రెడ్డిమళ్ల రాజా ఎన్నిక

**జయభేరి, కోదాడ :**



గ్రామ అభివృద్ధి కొరకు కృషి చేస్తానని గ్రామ యూత్ అధ్యక్షుడు రెడ్డిమళ్ల రాజా అన్నారు. అనంతగిరి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్ రెడ్డి ఆదేశానుసారం మండల యూత్ అధ్యక్షుడు మాగి నరేష్ ఆధ్వర్యంలో అనంతగిరి మండల పరిధిలోని పాలవరం గ్రామ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రెడ్డిమళ్ల రాజా ను మంగళవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తనకు ఈ అవకాశం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

గ్రామ అభివృద్ధి కొరకు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ నిధులు పేద ప్రజలకు అందేవిధంగా చేస్తామని హామీ ఇచ్చారు.

అనంతరం గ్రామ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జిల్లేపల్లి మహేష్ ను కూడా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు మట్టపల్లి రామకోటయ్య, బెల్లంకొండ పరశురాం, మట్టపల్లి నరేష్, కాసాని వెంకయ్య, తూటంగి శ్రీను, బెల్లంకొండ అంజయ్య, బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు.


## ప్రెస్ క్లబ్ కు స్తల కేటాయింపు కోసం ఎమ్మెల్యేకు లేఖ



**జయభేరి, కోదాడ:**


ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న జర్నలిస్టుల దీర్ఘకాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుడిమెట్ల రామకృష్ణ ప్రధాన కార్యదర్శి ఇరుగు వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు కోదాడ శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతికి మంగళవారం లేఖ రాశారు. అనేక ఉద్యమాల్లో పాత్రికేయుల పాత్ర మరువలేనిదని, పదేళ్లుగా వివిధ కారణాలతో కొందరు జర్నలిస్టులు ఆకస్మికంగా మరణించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున ముఖ్యమంత్రి దృష్టికి జర్నలిస్టుల సమస్యలు తీసుకువెళ్లాలన్న ఉద్దేశంతో స్థానిక ఎమ్మెల్యే కు లేఖను రాసినట్లు చెప్పారు. అనంతగిరి మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ ఆఫీసు కోసం స్థలం కేటాయించి నూతన భవనం మంజూరు చేయాలని ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిని లేఖలో కోరారు.

ప్రభాత
జయభేరి
సినిమా
12-03-2025
బుధవారం
05
jayabheridaily.com




# అమితాబ్ తప్పుకోబోతున్నాడా..

బుల్లితెర రియాలిటీ షోలలో కౌన్ బనేగా కరోడ్ పతికి ప్రత్యేకమైన స్థానం ఉంది. దాదాపు 15 సీజన్స్ పూర్తి చేసుకున్న ఈ షోని ఎంతో మంది ఇష్టపడతారు. ముఖ్యంగా అమితాబ్ బచ్చన్ హోస్టింగ్ ఈ షోకి పెద్ద ప్లస్ పాయింట్. ఆయన లేకుండా ఈ షో అసంపూర్ణం. చాలా ఏళ్లుగా బిగ్ బీ ఈ షోని సక్సెస్ ఫుల్‌గా నడిపిస్తున్నారు. ఈ షోలో ఎక్కువ సీజన్‌స్‌కి అమితాబ్ బచ్చనే హోస్టింగ్ చేశారు. అయితే ఇప్పుడు ఆయన ఈ షోని వీడబోతున్నారనే వార్త నెట్టింట చక్కర్లు కొడుతుంది. ఇది విన్న అభిమానుల గుండె పగిలినంత పని అయింది. అమితాబ్ లేకుండా ఆ షోని అసలు చూడగలుగుతామా అని భావోద్వేగానికి గురవుతున్నారు. అయితే అమితాబ్ కేబీసీ నుండి తప్పుకుంటే ఆయన స్థానంలో ఎవరు హోస్ట్‌గా వస్తారనే చర్చ నడుస్తుంది. నిజానికి బిగ్ బి 'కౌన్ బనేగా కరోడ్‌పతి'ని వీడాలనే కోరిక వ్యక్తం చేయగానే, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ బ్రాండ్స్ , ఒక యాడ్ ఏజెన్సీ దీని కొత్త హోస్ట్ గురించి సర్వే చేసింది. అమితాబ్ బచ్చన్ స్థానంలో ఎవరు వస్తే బాగుంటుందని సర్వే నిర్వహించగా ఇందులో 408 మంది పురుషులు, 360 మంది మహిళల అభిప్రాయాలు తీసుకున్నారు. 768 మంది మధ్య చేసిన ఈ సర్వేలో హోస్ట్‌గా మొదటి పేరు సూపర్ స్టార్ షారుఖ్ ఖాన్ పేరు తెరపైకి వచ్చింది. ఆయన కేబీసీ మూడో సీజన్‌కి హోస్ట్‌గా వ్యవహరించిన విషయం తెలిసిందే. ఇక సర్వేలో షారుఖ్ ఖాన్ తర్వాత ఎక్కువ మంది సూచించిన పేరు నటి ఐశ్వర్య రాయ్. ఆమె అమితాబ్ బచ్చన్ కోడలు కూడా. గతంలో ఆమె ఎప్పుడు ఏ షోకి హోస్ట్ చేసింది లేదు. కాని ఆమె హోస్ట్‌గా బాగుంటుంది అని కొందరు తమ అభిప్రాయ్ వ్యక్తం చేశారు. ఇక ఎంఎస్ ధోని కూడా ఈ షోకి హోస్ట్‌గా చేస్తే బాగుంటుందని అంటున్నారు. కాగా, బిగ్ బీ కేబీసీ తాజా ఎపిసోడ్‌లో కేబీసీ కార్యక్రమాన్ని వీడాలని అనుకుంటున్నట్టు తెలియజేసినట్టు సమాచారం. 82 ఏళ్ల అమితాబ్ బచ్చన్ కేబీసీ నుండి తప్పుకుంటే ఆయన స్థానంలో హోస్ట్‌గా ఎవరు వస్తారని అందరు ముచ్చటించుకుంటున్నారు.



# అర్ధరాత్రి హాలీవుడ్ కలలు..

హీరోయిన్ శ్రీలీల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. తన గ్లామర్‌తో టాలీవుడ్ అభిమానుల మనసు దోచుకుంది ఈ ముద్దుగుమ్మ. పెళ్లి సందడి సినిమాలో తన గ్లామర్‌తో ఆకట్టుకున్న ఈ బ్యూటీ, ఈ మూవీ తర్వాత వరసగా ఆఫర్స్ అందుకుంది. ఎవ్వరూ ఊహించని విధంగా వరసగా తొమ్మిది సినిమాలకు సైన్ చేసి రికార్డ్ క్రియేట్ చేసింది. ఇటీవల పుష్ప2లో కిసక్కీ అంటూ కుర్రకారుకు చెమటలు పట్టించింది ఈ ముద్దుగుమ్మ. తాజాగా శ్రీలీల హాలీవుడ్ నటి గెటప్‌లో ఫోటోలకు ఫోజులిచ్చింది. ఇందులో ఈ అమ్మడు అచ్చం హాలీవుడ్ యాక్టర్ లానే కనిపిస్తుంది. ఈ పిక్స్ తన ఇన్‌స్టాలో షేర్ చేస్తూ.. మిడ్ నైట్ ఎక్కడో హాలీవుడ్ సినిమాల కలలకు అంటూ క్యాప్షన్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.



# ఇద్దరు పిల్లల తల్లీ అయినా..

ఏం పిల్లో ఏపిల్లడో సినిమాతో టాలీవుడ్ వెండితెరపైకి ఎంట్రీ ఇచ్చిన ముద్దుగుమ్మ ప్రణీత. ఈ అమ్మడు ఈ సినిమాతోనే తెలుగు ప్రేక్షకుల మనసు దోచుకుంది. తర్వాత సిద్ధార్థ్ బావా సినిమాలో ఆఫర్ కొట్టేసి ఈ మూవీతో మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. బావా సినిమాలో పల్లె టూరి అమ్మాయిలా కనిపించి తన నటన, అందంతో వావ్ అనిపించింది. ఇక ఈ సినిమా తర్వాత ఈ బ్యూటీకి ఏకంగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమా, అత్తారింటికి దారేది మూవీలో ఛాన్స్ కొట్టేసింది. దీని తర్వాత వరసగా ఆఫర్స్ అందుకుంది. అయితే ఈ బ్యూటీ చాలా సినిమాల్లో నటించినప్పటికీ స్టార్ స్టేటస్ మాత్రం అందుకోలేకపోయింది. తర్వాత బెంగళూరుకు చెందిన వ్యాపారవేత్త నితిన్ రాజ్‌ను వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలు. ఇక తల్లైన తర్వాత ఈ బ్యూటీ అందం ఏ మాత్రం తగ్గలేదు. తన గ్లామర్‌తో ఇప్పటికీ కుర్రకారును అట్రాక్ట్ చేస్తూనే ఉంటుంది. సిమాలకు దూరమైనా, ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ వరస ఫొటో షూట్‌స్‌తో సందడి చేస్తుంటది. తాజాగా ఈ ముద్దుగుమ్మ తన అందాలతో మత్తెక్కించింది. ఏకంగా చూయింగ్ గమ్ డ్రెస్‌లో దర్శనం ఇచ్చింది. ఈ ఫొటోల్లో ఈ అమ్మడు చూడటానికి చాలా బ్యూటిఫుల్‌గా కనిపిస్తుంది. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.



# చిరు దెబ్బకి బెదిరిపోయిన నాని..

ఇండస్ట్రీలో స్వయంకృషితో ఎదిగిన వారిలో నాని కూడా ఒకరు. అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి నుంచి ఇప్పుడు స్టార్ హీరోగా ఎదిగారు. మరోవైపు నిర్మాతగా కూడా మంచి సినిమాలు తీస్తూ ప్రేక్షకులని అలరిస్తున్నారు. కంటెంట్ ఉన్న సినిమాలు చేస్తున్నాడు అని ఫ్యాన్స్ తో పాటు ప్రేక్షకులు, ఇండస్ట్రీ వారు నానిని ప్రశంసిస్తున్నారు. అయితే నాని నిర్మాణంలో ప్రియదర్శి మెయిన్ లీడ్ లో రూపొందిన కోర్ట్ సినిమా మార్చ్ 14 రిలీజ్ కానుంది. ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా నాని మూవీ టీమ్ తో కలిసి ఓ స్పెషల్ ఇంటర్వ్యూ చేయగా, ఇందులో చిరంజీవికి సంబంధించిన ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.

నాగచైతన్య పెళ్లికి వెళ్లినప్పుడు, నేను కారు దిగి మండపం వైపు వెళ్తుంటే చిరంజీవి గారు నాకు ఎదురు పడ్డారు. అప్పుడు ప్రొడ్యూసర్ గారు బాగున్నారా? అని కుశల ప్రశ్నలు వేసారు. ఆ సమయంలో నేను నా వెనుక అశ్వినీదత్ గారి లాంటి గొప్ప నిర్మాతలు ఉన్నారా అని చూసా.. ఎవ్వరూ లేరు. చిరంజీవి గారు చిరునవ్వుతో మిమ్మల్నే ప్రొడ్యూసర్ గారు అంటూ నన్ను హగ్ చేసుకున్నారు. ఆ మాట విని ఆశ్చర్యపోయాను అని నాని అప్పటి విషయాన్ని గుర్తు చేసుకున్నారు. నాని చేసిన కామెంట్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

ఇక ఇదే ఇంటర్వ్యూలో ప్రియదర్శి మాట్లాడుతూ, చిరంజీవి 'కోర్ట్' సినిమా పోస్టర్ చూసి నన్ను అభినందించారు. నువ్వు సూట్ వేసుకున్న పోస్టర్ నేను చూశాను. చాలా బాగున్నావ్.. నాని నిర్మాత కాబట్టి సినిమా హిట్ అవుతుందిలే అని చిరంజీవి చెప్పారని, అలా ఆ రోజు ధైర్యంగా చెప్పిన మాటలు తనలో ఎంతో సంతోషాన్ని నింపాయని ప్రియదర్శి చెప్పుకొచ్చారు. కాగా, చిరంజీవి - శ్రీకాంత్ ఓదెల సినిమాకి నాని సమర్పకుడిగా ఉన్న విషయం తెలిసిందే. చిరంజీవి మొదటి నుంచి నానిని అభినందిస్తూ ఆయనకి తనవంతూ సపోర్ట్ అందిస్తున్నారు. చిరంజీవినాని మధ్య మంచి రిలేషన్ షిప్ ఉంది..

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com